కబ్జాకోరల్లో చెరువు..

- చెరువులో చేరుతున్న మురుగునీరు
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

తగ్గిపోతున్న మక్తమహబూబ్‌పేట కిందికుంట చెరువు


చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

మియాపూర్: చెరువులు కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. గతంలో ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చిన చెరువుల్లో ప్రస్తుతం డ్రైనేజీ నీరు చేరి దుర్గంధపూరితంగా మారాయి. దీనికి తోడు చెరువుల చుట్టు కంచె లేకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి. చెరువు శిఖం, బఫర్ జోన్‌లలో మట్టిపోసి ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చెరువు ఉనికిని కోల్పోతుంది. మియాపూర్ మక్తమహబూబ్‌పేట చెరువు ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

- మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట చెరువు 121 సర్వే నంబర్‌లో 24 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది.
- చుట్టుపక్కల ఉన్న మక్తకాలనీ, జనప్రియ వెస్ట్‌సిటీ, ప్రజా షెల్టర్‌తో పాటు చెరువు పైభాగంలో ఉన్న అపార్ట్‌మెంట్ల నుండి మురుగునీరు నేరుగా మక్తమహబూబ్‌పేట చెరువులో కలుస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుంది.
- అభివృద్ధి చేస్తామని ప్రతి కార్యక్రమంలో చెప్పుకొస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారు లు చెరువు అభివృద్ధిని పక్కన పెట్టి ప్రతిఏటా గుర్రపుడెక్కను తొలగించడం, మరలా గు ర్రపు డెక్క అల్లుకుపోవడం జరుగుతూనే ఉంది.


రెడ్డి కాలనీ వైపు చెరువుశిఖంలో మట్టిని నింపిన దృశ్యం

- గుర్రపుడెక్క అల్లుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారింది. సాయంత్రం కాగానే దోమలు సమీపంలోని కాలనీలపై దండయాత్ర చేస్తున్నాయి. దోమకాటుతో అనారోగ్యం పాలవుతున్నామని సమీప కాలనీల వాసులు వాపోతున్నారు.
- ప్రశాంత్‌నగర్, జేపీనగర్, మక్తమహబూబ్‌పేట, పీజేఆర్ ఎన్‌క్లేవ్ కాలనీల వైపు నుంచి వచ్చే వాహనదారులు రెడ్డికాలనీ, బీకే ఎన్‌క్లేవ్ బొల్లారం వైపు వెళ్లేందుకు మక్తమహబూబ్‌పేట చెరువుకట్టను వినియోగిస్తారు. చెరువుకట్ట చిన్నదిగా ఉండడంతో చెరువుకట్టపై నుండి వెళ్లే వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ఆక్రమణల బారిన..

- మక్తమహబూబ్‌పేట చెరువు(కిందికుంట) విస్తీర్ణం 24 ఎకరాలు కాగా ప్రస్తుతం కబ్జాల కారణంగా 16 ఎకరాలకు పరిమితమైంది. కొంతమంది పైభాగంలో మట్టి పోసి ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు చెరువును పరిశీలించి వెళ్తున్నారే తప్ప.. రక్షణ చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- చెరువుకట్ట సమీపంలో చెరువుశిఖం భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు, సెల్లార్ల నుండి మట్టి, బండరాళ్లను వాహనాల ద్వారా తీసుకువచ్చి వేశారు. కానీ ఇప్పటి వరకు అధికారులు వ్యర్థాలు వేసిన వారిని గుర్తించడం కానీ, వారిపై చర్యలు తీసుకోవడం చేయలేదు.
- సంబంధిత అధికారుల అండదండలతోనే కబ్జాల పరంపర కొనసాగుతుందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.
- చెరువు పైభాగంలో రెడ్డికాలనీ వైపు చెరువు శిఖం భూమిలో మట్టిపోసి ఆక్రమణకు తెర లేపిన ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు
- చెరువులను సుందరీకరించి చెరువు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా పట్టించుకోలేదని లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- చెరువును సర్వే చేయించి చుట్టపక్కల ఉన్న ఆక్రమణలను తొలగించడంతో బాటు చెరువులోకి మురుగునీరు రాకుండా పైపులైన్ ఏర్పాటు చేసి చెరువును కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ బాట


కార్యక్రమంలో పాల్గొన్న టీచర్, తల్లులు, చిన్నారులు

రాయదుర్గం: అంగన్‌వాడీ (ప్రీస్కూల్) కేంద్రాలలో అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. శేరిలింగంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మంగళవారం ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఇంటింటికి తిరుగుతూ చిన్నారులను ప్రీస్కూల్‌లో చేర్పించేలా అవగాహన కల్పిస్తున్నారు. ఖాజాగూడ అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది చేరారని టీచర్ జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో కేంద్రం హెల్పర్ లక్ష్మీ, తల్లులు అరుణ, మంగ, స్వరూప, సుశీల,సింధు, రూపశ్రీ, ప్రీస్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

మాదాపూర్ ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్‌గుప్తా

మణికొండ: గంజాయి, డ్రగ్స్ వాడకం, అమ్మటం, భూ కబ్జాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి కటకటాల వెనక్కి పంపిస్తామని, ఇక మీదట ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని మాదాపూర్ ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్‌గుప్తా, అదనపు డీసీపీ శ్రీనివాస్‌రెడ్డిలు రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళవారం నార్సింగిలోని ఎస్‌ఓటీ పోలీస్‌స్టేషన్ వద్ద 92 మంది రౌడీషీటర్లకు వారు కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడినా, సేవించినా ఇతరత్రా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాదాపూర్ ఎస్‌ఓటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన కాలువ పనులు పూర్తి చేయాలి


వరద నీటి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: చందానగర్ ప్రధాన రహదారిపై చేపట్టిన వరద నీటి కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అను ఫర్నీచర్ షోరూమ్ వద్ద గల వరద నీటి కాలువ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు వేగవంతం చేయాలని సూచించారు. అభి వృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈ పరిశీలనలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, కాంగ్రెస్ నాయకులు గౌతమ్ గౌడ్, లక్ష్మీనారాయణ, రాంచందర్ పాల్గొన్నారు.

అన్నపూర్ణ కేంద్రాలను పెంచాలి

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: పేదల ఆకలిని తీర్చే అన్నపూర్ణ కేంద్రాల సంఖ్యను పెంచాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం బయోడైవర్సిటీ, కొత్తగూడ, రాడిసన్ హోటల్, మసీద్‌బండ, కొండాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. రహదారుల శుభ్రతపై సిబ్బంది మరింత శ్రద్ధగా పని చేయాలన్నారు. కాగా అవసరమున్న ప్రదేశాలను గుర్తించి బస్తీ దవాఖానాలు, అన్నపూర్ణ కేంద్రాల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రధాన రహదారుల్లో కూడళ్ల నిర్వహణ మరింత మెరుగుపడాలని పేర్కొన్నారు. రహదారుల పక్కన పేరుకుపోయిన ఇసుక, మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఉప కమిషనర్ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు రోజువారీగా పారిశుద్ధ్య పనులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.


రహదారుల శుభ్రతపై అధికారులకు సూచనలిస్తున్న జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

19 నుంచి సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహరా తదితర మోడల్స్

బంజారాహిల్స్: బెంగాల్ ఆర్ట్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న సిల్క్ ఆఫ్ ఇండియా ఎగ్జిబిషన్‌ను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమనాథ్, అభిజిత్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీ సిల్వాన్ డ్రైవ్ ఇన్‌లో సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహరాతో పాటు పలువురు మోడల్స్ పాల్గొని కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో 50 మందికి పైగా మాస్టర్ వీవర్స్ చేతితో నేసిన వస్త్ర ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు. చేనేత ఉత్పత్తులతో పాటు హస్తకళల ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

ఏఐ ఇన్నోవేషన్ సమ్మిట్ 2024 ప్రారంభం

మాదాపూర్: ఫైనాన్స్ ఫంక్షన్ల సమర్థత, ఖచ్చితత్వాన్ని పెంపొందించడంలో (ఏఐ) ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసీఏఐ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో మంగళవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ)ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఏఐ ఇన్నోవేషన్ సమ్మిట్‌ను ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో సంస్థ వైస్‌ప్రెసిడెంట్ చరణ్‌జిత్‌సింగ్ నందా, ఐసీఏఐలో ఏఐ చైర్మన్ దయానివాస్ , వైస్ చైర్మన్ ఉమేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. సీఏలకు ఉపయోగకరంగా ఉంచే విధంగా ఫైనాన్షియల్, అకౌంటింగ్ విధులకు సంబంధించి 100 ఏఐ టూల్స్‌తో డిజిటల్ పబ్లికేషన్‌ను ఆవిష్కరించారు. పరీక్షల కోసం సన్నద్ధం అయ్యేలా విద్యార్థులకు తోడ్పడేందుకు ఐసీఏఐ సీఏ జీపీటీని ఆవిష్కరించారు. ఈ సదస్సులో అంతర్జాతీయ ఏఐ నిపుణులు, టెక్‌పరిశ్రమ దిగ్గజాలు, విధానకర్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.



సమ్మిట్‌లో పాల్గొన్న సంస్థ చైర్మన్ రంజిత్‌కుమార్ అగర్వాల్, సంస్థ వైస్‌ప్రెసిడెంట్ చరణ్‌జిత్‌సింగ్ నందా, ఏఐ చైర్మన్ దయా నివాస్

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: బోనాల పండగను పురస్కరించుకొని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం చిత్తారమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, రంగారావు,చిన్న తులసి పాల్గొన్నారు.

విచారణకు ఆదేశం

సాక్షి,సిటీబ్యూరో: ఫరూఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సు కండక్టర్ ఓ యువతి పట్ల ప్రవర్తించిన తీరుపై ఆర్టీసీ అధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రయాణ సమయంలో బస్సు కండక్టర్ తనతో ప్రవర్తించిన తీరు సరిగా లేదని ఒక యువతి సోషల్ మీడియా ద్వారా ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించింది. నివేదిక ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఆర్టీసీ అధికారుల చొరవతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 75 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిర్వహించే కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ కోర్సుల్లో చేరే వారు కనీసం ఏడో తరగతి, ఎంఎస్‌ఆఫీస్ కోర్సుల్లో చేరాలనుకునే వారు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆగస్టు 1 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు 9440788502 నంబరులో సంప్రదించాలన్నారు.

దోమల నివారణపై అవగాహన



మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయంలో డెంగ్యూ, మలేరియాపై మహిళా సంఘాల సభ్యులకు మంగళవారం అవగాహన కల్పించి, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంటమాలజీ ఏఈ నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటువల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా రోగాలు వస్తున్నాయని, నివారణ మార్గాలే రక్షణ చర్యలు అని పేర్కొన్నారు.

మూసీ నది పరిశీలన

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని మూసీ నదిని మంగళవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంజయ్య గౌడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువులో అల్లుకుపోయిన గుర్రపు డెక్క నివారణకు అవసరమయ్యే కార్యచరణను చేపట్టడానికి అంచనాలను రూపొందించి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్‌ను యుద్ధప్రాతిపదికన చేపడతామని ఎంటమాలజీ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్స్ సేఫ్టీవింగ్ డీసీపీ సృజన


మాట్లాడుతున్న డీసీపీ సృజన

రాయదుర్గం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం మాదకద్రవ్య వినియోగంపై సైబరాబాద్ పోలీసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనమవుతుందని, వాటి నివారణకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల కోసం 8712671111కి కాల్ చేసి చెప్పాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అమృత ఫౌండేషన్ ఎన్‌జీఓ డైరెక్టర్, పరిశోధక సైకాలజిస్ట్ దేవికారాణి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ ఏసీపీ ప్రసన్నకుమార్, ఇన్‌స్పెక్టర్ సునీత, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీకన్సల్ట్-అబ్దుల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎంఓయూ

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో టీకన్సల్ట్- అబ్దుల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. మంగళవారం ఇరు సంస్థల ప్రతినిధులు సమావేశమై ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాలా, ప్రముఖ ఎమిరేట్స్ వ్యాపారవేత్త అబ్దుల్లా సంతకాలు చేశారు. టీ కన్సల్ట్ 30 వినూత్న స్టార్టప్‌లు, వ్యాపారాల జాయింట్ వెంచర్ ఒప్పందాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం అంతర్జాతీయ వ్యాపార వృద్ధి, ఆర్థిక శ్రేయస్సును ప్రోత్సహిస్తుందన్నారు.


ఒప్పందం చేసుకున్న ఇరు సంస్థల ప్రతినిధులు సందీప్‌కుమార్‌మక్తాలా, అబ్దుల్లా

చెరువులా ప్రధాన రహదారి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పాపారాయుడునగర్ ప్రధాన రహదారి చెరువులా తయారైంది. ఇటీవల కురిసిన వర్షానికి నీరు అంతా రోడ్డుపై నిలిచిపోవటంతో చెరువును తలపిస్తోంది. నీరు నిలిచిపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోవటం లేదని వాపోయారు.

ఇప్పుడేం చేద్దాం?

అయోమయంలో బీఆర్ఎస్ శ్రేణులు

- ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులు కాంగ్రెస్‌లో చేరటంపై ఆగ్రహం
- సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు
- త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామంటున్న స్థానిక గులాబీ నేతలు

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరటంపై ఆ పార్టీ నేతలు షాక్‌కు గురయ్యారు. తాము ఓటు వేసి గెలిపించిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వెళ్లటంతో జిన్నారం, గుమ్మడిదల మండలాల బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ రెండు మండలాల నేతలు త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని తమ కార్యాచరణను ప్రకటిస్తామని చెబుతున్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ సద్ది ప్రవీణ, బీఆర్ఎస్ గుమ్మడిదల మండల అధ్యక్షులు హుస్సేన్, నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడితో పాటు పలువురు నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. దీంతో స్థానిక బీఆర్ఎస్ నేతల్లో అయోమయం నెలకొంది. జిన్నారం మండలం నుంచి కేవలం మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ ఒక్కరే ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్‌లో చేరారు. పదేళ్ల పాటు పదవులు అనుభవించి ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరడంపై మండల నాయకులు సోషల్ మీడియా ద్వారా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలను కాంగ్రెస్‌లో చేరాలని ప్రభాకర్ ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది. అయితే గులాబీ నాయకులు ఏ నిర్ణయం తీసుకుంటారోననే ఉత్కంఠ కలుగుతోంది. త్వరలోనే సమావేశమై తదుపరి నిర్ణయం తీసుకుంటామని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు.

గుమ్మడిదల మండలంలోని మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులతో పాటు పలువురు ముఖ్య నేతలు ఎమ్మెల్యేతో సహా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మండల వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు నష్టంజరిగింది. ఈ నష్టాన్ని స్థానిక నాయకులు ఎలా పూడ్చుకుంటారో చూడాలి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, నీలం మధు, ఇప్పుడు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిలతో పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపడిందని చెప్పవచ్చు. కానీ మున్ముందు వీరి మధ్య ఎంత సఖ్యత ఉంటుందనేది వేచి చూడాల్సి ఉంది.

ట్రిపుల్ ఐటీ బస్టాప్‌లో మొబైల్ బస్‌పాస్ కౌంటర్



రాయదుర్గం: ఐటీ ఉద్యోగులు, ఇతర ప్రయాణికుల సౌకర్యార్థం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో అధికారులు ట్రిపుల్‌ఐటీ బస్టాప్‌లో మొబైల్ బస్‌పాస్ కౌంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ బస్‌పాస్ కౌంటర్ ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటలవరకు అందుబాటులో ఉంటుందని కౌంటర్ ఏటీఎం మహేష్‌కుమార్ తెలిపారు. బస్‌పాస్ కోసం లింగంపల్లి వచ్చే పని లేకుండా ఈ మొబైల్ బస్‌పాస్ కౌంటర్ అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని ఐటీ ఉద్యోగులు, ప్రయాణీకులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి


బీరంగూడ శక్తి సదన్‌లో అవగాహన కల్పిస్తున్న సమన్వయకర్త పల్లవి

పటాన్‌చెరు: హక్కులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి అన్నారు. మహిళలు, బాలికల రక్షణ చట్టాలపై జిల్లా శిశు సంక్షేమశాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మిషన్ శక్తి 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్, పాశమైలారం, అంగన్‌వాడీ సెంటర్లలో, శక్తి సదన్ బీరంగూడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ... మహిళలు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హక్కుల గురించి వివరించారు. అదేవిధంగా సఖి కేంద్రం సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఉపయోగాలను, శక్తి సదన్ సేవలను గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సల్మా , శక్తి సదన్ ఇంచార్జ్ సుజాత ,అంగన్‌వాడీ టీచర్లు ,విశాల ,సరిత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి



జిన్నారం(పటాన్‌చెరు): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి ప్రజలకు సూచించారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో సీజనల్ వ్యాధుల పట్ల మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఆయా కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రోజారాణి వర్షాకాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో మొక్కలు పెంచాలి

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో వీలైనన్ని మొక్కలు పెంచాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ నుంచి ప్రతి ఇంటికి వారు పెంచగలిగే మొక్కలను ఉచితంగా అందిస్తామని, వాటిని పెంచాల్సిన బాధ్యతను ప్రజలు తీసుకోవాలన్నారు. ప్రతి వార్డులోని రోడ్ల పక్కన, డివైడర్‌ల పైన, ఖాళీ స్థలాల్లో వీలైనన్ని మొక్కలను పెంచేందుకు మున్సిపాలిటీ తరపున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ దుర్గేష్‌యాదవ్, డీఈ నరసింహరాజు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల కోసం విద్యార్థుల ధర్నా

జిన్నారం(పటాన్‌చెరు): ఆర్టీసీ బస్సులను అదనంగా కేటాయించటంతో పాటు, బస్సులను స్టాప్‌ల వద్ద ఆపాలని కోరుతూ విద్యార్థులు మంగళవారం ధర్నా చేశారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ ప్రధాన రహదారిపై ఉదయం విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఉదయంపూట ఆర్టీసీ బస్సులను పెంచటంతో పాటు బస్టాప్‌ల వద్ద బస్సులను ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కల్పించుకుని జీడిమెట్ల డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్యను వివరించారు. బస్సుల సంఖ్యను పెంచటంతో పాటు బస్టాప్‌లో బస్సులను ఆపేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వటంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

రోడ్డుపై మురుగు.. ఇబ్బందులు

మియాపూర్: ప్రధాన రహదారిలో మురుగు ప్రవాహంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్‌లోని ఎంఏనగర్ నుండి శాంతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో మ్యాన్‌హోళ్ల నిండి మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంది. ఈ రోడ్డు వెంబడి ప్రయాణించే వాహనదారులు, పాదచారులు మురుగు నీటిలో నడవాల్సి వస్తోంది. దీనికితోడు దుర్వాసన భరించలేక పోతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై మురుగు నీరు పడుతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


ఎంఏనగర్ నుండి శాంతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో..